నేటి దినపత్రిక

# సూర్య

18వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 22 జనవరి 2025 | పేజీలు 8


## జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా మరోసారి వంశీధర్ రెడ్డి

### బీజేపీ కార్యాలయం నుండి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండవసారి సీపా రెడ్డి వంశీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం నెల్లూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియ తదుపరి ఎన్నికల పరిశీలకులు వంశీధర్ రెడ్డిని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు వంశీధర్‌రెడ్డిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పదవికి రెండోసారి మద్దతు తెలిపిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడం, అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయడం నా ప్రధాన లక్ష్యమన్నారు. మోదీ నాయకత్వంలో

-మిగతా 2లో




- సక్రమంగా అమలుకాని ఆహార పట్టిక
- నిర్వహణ భారంతో సంక్షేమ అధికారులు సతమతం
- పడిపోతున్న విద్యార్థుల సంఖ్య
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

# గాడితప్పిన సంక్షేమం !

**ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల భోజనాలకు సంబంధించి ఆహార పట్టిక అమలుకు అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారింది. గత ప్రభుత్వ చర్యలతో విద్యార్థులు, నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర సరుకుల ధరల మేరకు చార్జీలు పెంచాలని.. లేదా మెనూ మార్చాలని.. సంక్షేమ అధికారులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఫలితంగా సాధారణ భోజనంతోనే సరిపెడుతున్నారు. తద్వారా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అస్తవ్యస్తంగా సాగుతున్న వసతి గృహాల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.** *వివరాల్లోకెళ్తే..*

*మర్రిపాడు, మేజర్‌న్యూస్ :*

జిల్లాలో ఎస్సీ 73, ఎస్టీ 15, బీసీ 78 వసతి గృహాలు ఉన్నాయి. 2023వ సంవత్సరంలో 3 నుంచి 4వ తరగతి వరకు నెలకు 150 రూపాయలు, 5 నుంచి 10వ తరగతి వరకు 160 రూపాయలు, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు మరికొంత ధర ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుముందు ఇస్తున్న మొత్తానికి 200 రూపాయలు పెంచి కొత్త మెనూ అమలు చేయాలని సూచించడంతో సమస్య తలెత్తింది. అప్పటి వరకు వారానికి మూడు గుడ్లు, ఒకసారి చికెన్ పెట్టేవారు. మెస్ ఛార్జీలు నామ మాత్రంగా.. మెనూ గణనీయంగా పెంచడంతో సంక్షేమ అధికారులు తలలు పట్టుకున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఉదయం అల్పాహారం, సాయంత్రం చిరుతిండి, రాత్రి భోజనం అందజేయాల్సి ఉంది. బియ్యం మినహా మిగిలిన సరుకులన్నీ మార్కెట్లో కొనుగోలు చేయాలి.

**ఇదీ పరిస్థితి..**

మెస్‌చార్జీలు నిర్ణయించే నాటికి కందిపప్పు ధర కిలో రూ.80 నుంచి

-మిగతా 2లో

### దావోస్ పర్యటన

## సొంత డబ్బాలకే..



- రాష్ట్ర ప్రయోజనాలకు చంద్రబాబు తూట్లు
- వాపును చూసి టీడీపీ నేతలు బలుపు అనుకుంటున్నారు
- మాజీ మంత్రి కాకాణి విమర్శ

ముఖ్యమంత్రి దావోస్‌కు వెళ్లి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ తమ డబ్బాలు కొట్టుకుంటున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలకు చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు.

2లో

### దోమల నివారణకు యుద్ధ ప్రాతిపదికన

## చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

2లో

### బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసేవారికి

## జరిమానా విధించండి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తూ వీధులను గార్బేజ్ పాయింట్లుగా మారుస్తున్న స్థానికులను గుర్తించి వారికి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా స్థానిక 45, 46

-మిగతా 2లో

### రోడ్డు ప్రమాదాల నుంచి

## ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యం

- పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలు
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలోని నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలి
- ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన
- జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు
- జిల్లా కలెక్టర్ ఆనంద్

5లో




రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు భద్రత కమిటీలోని అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్ష తన నిర్వహించారు. తొలుత జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ నినాదాలతో ఏర్పాటు చేసిన మెగా ఫ్లెక్సీని కలెక్టర్, కమిషనర్ సూర్యతేజ ఆవిష్కరించారు.

### పరిసరాల పరిశుభ్రత

## ప్రతిఒక్కరి బాధ్యత

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులను సమన్వయం చేసుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. కోవూరు నియోజకవర్గంలోని

-మిగతా 2లో

# దావోస్ పర్యటన సొంత డబ్బాలకే..



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి దావోస్‌కు వెళ్లి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ తమ డబ్బాలు కొట్టుకుంటున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలకు చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తన అబద్దాలను మానుకోకుండా చెత్త రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అడుగుతారని భయంతోనే డైవర్షన్ పాలిటిక్స్‌ను చేస్తున్నారన్నారు. చంద్రబాబు పరిస్థితి ఆ విధంగా ఉంటే.. మరోవైపు లోకేష్ తన తండ్రిని పొగుడుతూ డబ్బా కొడుతున్నారని విమర్శించారు. కోట్లాది ప్రజాధనాన్ని విదేశీ పర్యటన పేరుతో చంద్రబాబు దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. 2004 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచి ఉంటే, రాష్ట్రం అధోగతి పాలయ్యేదన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఘన విజయం సాధించబట్టే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను వైయస్సార్ ప్రవేశపెట్టారన్నారు. ఎన్నికల్లో దివంగతగత వైయస్సార్ గెలవబట్టే ఆరోగ్యశ్రీ, 108, ఉచిత విద్య, రైతుకు ప్రోత్సహకాలు, ఫీజు రీయింబర్స్మెంట్ తదితర పథకాలు ప్రజలకు అందాయని వివరించారు. చంద్రబాబు హాయంలో శంషాబాద్ విమానాశ్రయానికి కనీసం భూసేకరణ కూడా చేయలేకపోయారని విమర్శించారు. 2004 ఎన్నికల్లో బాబు గెలిచి ఉంటే రాష్ట్రం వల్లకాడు అయ్యేదన్నారు. వైయస్సార్ గెలవడం వల్ల పేద ప్రజలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఏ రోజు కూడా చంద్రబాబు సార్వత్రిక ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కోలేదని విమర్శించారు. 1995లో చంద్రబాబు దివంగత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. 1999 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని వాజ్‌పేయి హవాతో గెలుపొందాడన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే పరమావధిగా ప్రధాని నరేంద్ర మోడీపైన విపరీతంగా విమర్శలు చేసి, ఇటీవల తిరిగి ఆయనను బతిమిలాడుకొని పొత్తు కుదుర్చుకున్నారన్నారు. పొత్తుల కోసం వెంపర్లాడుతూ.. ఏరోజు కూడా తన సొంత బలం మీద చంద్రబాబు ఎన్నికల్లో గెలవలేదని విమర్శించారు. వాపును చూసి తెలుగుదేశం పార్టీ నేతలు బలుపుని భ్రమ పడుతున్నారని, ఇవి నీటి బుడగలుగా పేలినప్పుడు వారి సొంత బలం తెలుతుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన చేసి అనేక పెట్టుబడులను తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడులను తీసుకురావడంలో వైఫల్యం చెందుతూ ప్రచారాన్ని మాత్రం కొండంతగా చేస్తున్నారని విమర్శించారు. గతంలో నారా లోకేష్ రెడ్‌బుక్ రాస్తున్నారని భయపెట్టేవారని, ప్రస్తుతం ప్రజలు ప్రజా బుక్ రాస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని తెలుగుదేశం పార్టీ నాయకులు శాశ్వతంగా సమాధి కావడం ఖాయమన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసేవారికి జరిమానా విధించండి

(మొదటి పేజీ తరువాయి)

డివిజన్లలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పొగతోట ప్రాంతంలోని అన్ని ఆసుపత్రులు, మెడికల్ షాపులు విధిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని సూచించారు. లైసెన్సులు లేకుండా వైద్య సేవలు లేదా ఇతర సేవలు అందించడం చట్టరీత్యా నేరమని, తమ దృష్టికి వస్తే ఆయా సంస్థలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని చెత్తకుండీలు పాతవాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పొగతోట ప్రాంతంలో ప్రణాళిక బద్ధంగా భూగర్భ డ్రైనేజీ పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. రైల్వే విభాగం అధికారులతో సంప్రదించి ట్రాక్‌ని ఆనుకుని ఉన్న గోడకు పెయింటింగ్ పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించిన అడ్వర్టైజ్మెంట్ బోర్డులు, ఆసుపత్రుల సూచికలు, ఇతర సైన్ బోర్డులను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్డు పక్కన వదిలేసిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులతో సంప్రదించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

అనంతరం ఇందిరా భవన్ రోడ్డులోని అన్నా క్యాంటీన్ కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. విజయ్ మహల్ గేట్ సమీపంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను కమిషనర్ తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేలూరు మహేష్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, రెవెన్యూ ఆఫీసర్ ఇనయతుల్లా, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గాడి తప్పిన సంక్షేమం !



(మొదటి పేజీ తరువాయి)

నుంచి రూ.90 ఉండగా ప్రస్తుతం రూ.160లకు చేరింది. నూనె లీటర్‌కు రూ.60 వరకు పెరిగింది. చికెన్, గుడ్డు, చింతపండు, కూరగాయలు, ఇతర సరుకుల ధరలు దాదాపుగా రెట్టింపు అయ్యాయి. వారానికి ఆరుసార్లు గుడ్డు, మూడుసార్లు చికెన్, ఏడుసార్లు పండ్లు ఇవ్వాలి. విద్యార్థులకు ఉదయం 7 గంటలకు పాలు ఇచ్చిన తర్వాత అల్పాహారం అందజేయాలి. పూరి, పులిహోర, రెండుసార్లు ఇడ్లీ, జీలకర్ర అన్నం, బన్సీ రవ్వ ఉప్మా, పెసరపప్పు పొంగలి.. ఇలా రోజుకొక కూర, చట్నీలతో పెట్టాలి. చాలా వసతి గృహాల్లో సాధారణ భోజనమే పెడుతున్నారు. అన్నంతో తయారు చేసే పులిహోర వంటి అల్పాహారమే అందిస్తున్నారు. వారానికి ఒకటి రెండు రోజులే చికెన్ ఇస్తుండగా.. గుడ్డు మూడు రోజులకే పరిమితం చేశారు. గత ప్రభుత్వం 2023వ సంవత్సరంలో నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందజేయాలంటే విద్యార్థికి అదనంగా రూ.400 నుంచి రూ.600 వరకు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందని చెప్పినా.. అప్పటి ధరలను పరిగణలోనికి తీసుకోకుండా ఆహార పట్టిక నిర్ణయించారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క విద్యార్థికి అదనంగా రూ.1000 పెంచితే తప్ప అమలు చేయలేని పరిస్థితి ఉందని నిర్వాహకులు తేల్చి చెప్పేస్తున్నారు.

గత ప్రభుత్వం వసతి గృహాల గురించి పట్టించుకోకపోవడంతో జిల్లాలోని కొన్ని వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని చెప్పవచ్చు. ఓ పక్క శిథిలావస్థలో ఉన్న గృహాలు, సరిపడా మెనూ లేకపోవడంతో ఈ సంఖ్య తగ్గిందని చెప్పవచ్చు. కొన్ని వసతి గృహాల్లో నిత్యవసర సరుకులు చేరవేసే నిర్వాహకులు కూడా చేతులెత్తేయడంతో వార్డెన్ల మీదే భారం పడింది. ప్రభుత్వం ఇచ్చే ధరల కంటే రెట్టింపుగా మార్కెట్లో ధరలు ఉండడంతో సరుకులు తేవడం గగనమైంది. అందువలన ఓటమి ప్రభుత్వమైన వసతి గృహాలపై దృష్టి సారించి విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా మరోసారి వంశీధర్ రెడ్డి



(మొదటి పేజీ తరువాయి)

పార్టీని మరింత బలపర్చడానికి నా శక్తిమేరకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసేవకు ఇది తన రెండో ఇన్నింగ్స్ అని, ప్రతి కార్యకర్త, నాయకులతో కలిసి పార్టీ శ్రేయస్సు కోసం సమష్టిగా పని చేస్తానని చెప్పారు. అనంతరం వంశీధర్‌రెడ్డి ఎన్నిక సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, అభిమానులు బాణసంచా పేల్చి జిల్లా కార్యాలయం నుండి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చారు. వీఆర్సీ సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వంశీధర్ రెడ్డి నివాళులర్పించారు.

**ఆటో కార్మికుల అభిమానం :**

వంశీధర్ రెడ్డి రెండోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ముత్తుకూరు బస్టాండ్ సెంటర్లోని ఆటోస్టాండ్ డ్రైవర్లు ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ.. నినాదాలు చేసి ఆయనను అభినందించారు.

## దోమల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోండి

### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో ప్రధాన సమస్యగా ఉన్న దోమలను నియంత్రించి, వాటి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ సూర్యతేజ, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్, ఆయిల్ బాల్స్ పిచికారి, కాలువల్లో గంబూజియ చేపల పెంపకం వంటి వాటితో పాటు ఇతర సరికొత్త పద్ధతులను అవలంబించి దోమలను నివారించాలని సూచించారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రధాన రోడ్లతో పాటు అన్ని ప్రాంతాలలో ప్యాచ్‌వర్క్‌లు, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎల్‌అండ్‌టి, మెగా కంపెనీల ఆధ్వర్యంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా బారాషాహీద్ దర్గా ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సంయుక్తంగా నిధులను కేటాయించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్‌మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఈఈ శేషగిరిరావు, ఎల్‌అండ్‌టి, మెగా కంపెనీల ప్రతినిధులు, నుడా అధికారులు, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



అధికారులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశించారు. డ్రైనేజి కాలువలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే చెత్త వేసి పారిశుధ్య కార్మికులతో సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీధుల్లో చెత్తా చెదారాలు పేరకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్లక్ష్యం కారణంగా ప్రబలే అంటువ్యాధుల గురించి ప్రజలకు వివరించాలని అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. నిరంతర ఫాగింగ్ ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతో అప్రమత్తమైన పంచాయతీ అధికారులు కోవూరు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

# తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న గుండాల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** గుండాల నరేంద్ర బాబు గత రెండున్నర దశాబ్దాలుగా తెలుగు భాషకి, తెలుగు సాహిత్యానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా 'తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి' ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన ప్రముఖ అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 21వ తేదీన విజయవాడలోని 'కొత్తా పూర్ణానంద విలాస్ కళా వేదిక" నందు నిర్వహించిన సభలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి తదితరులచే 'గుండాల నరేంద్రబాబును తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని శాలువా జ్ఞాపిక, పూల మాలతో ఘనంగా సత్కరించి అందజేశారు. ముత్తుకూరు మండలంలోని దమ్మాయిపాలెం గ్రామానికి చెందిన గుండాల నరేంద్ర బాబు వృత్తిరీత్యా నెల్లూరు భక్తవత్సల నగర్ నివాసి. కె.ఎన్.ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల నందు ప్రస్తుతం తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతిలో 'వి.ప్రతిమ సాహిత్యం పరిశీలన' అను అంశంపై పీహెచ్డీ చేస్తున్నారు.వీరు ఇప్పటివరకు 'సూక్తి స్ఫూర్తి, వెన్నెల జలపాతం, తెలుగు భాష సాహిత్య కరదీపిక" తదితర పుస్తకాలను వెలువరించారు. 500కు పైగా బాలగేయాలను రచించారు. వెయ్యికి పైగా పలు సామాజిక చైతన్య గీతాలను రచించారు. వీరి కవితలు, గేయాలు, గీతాలు పలు దిన, వార, మాస, పక్ష పత్రికలలో ప్రచురింపబడి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నవి. గతంలో జనవరి 2024లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ వారిచే ఉత్తమ కవి పురస్కారాన్ని అందుకున్నారు. 2022లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ముఖ్యమంత్రివర్యులచే అందుకున్నారు. అంతేకాకుండా 2012వ సంవత్సరం నుంచి 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్సిసి నెల్లూరు నందు అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఎన్నెన్నో విశిష్ట సేవలు అందజేసినందుకు గుర్తింపుగా జనవరి 2024లో గుంటూరు గ్రూపు ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్‌చే ఉత్తమ ఎన్‌సీసీ ఆఫీసర్ అవార్డును, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఎన్‌సీసీ డైరెక్టరేట్ స్థాయిలో ఉత్తమ ఎన్‌సిసి నేవల్ ఆఫీసర్ అవార్డు 2024-25 ను 2024 నవంబర్ 24వ తేది ఎన్ సిసి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నందు ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్ట్ జనరల్ ఎయిర్ కమడోర్ వి. మధుసూదన్ రెడ్డి నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సాహిత్య వేత్తలు నరేంద్రబాబుకు అభినందనలు తెలియజేశారు.

# నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నేటి నుండి జరిగే జేఈఈ మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పొట్టేపాలెంలోని ఇయాన్ డిజిటల్ జోన్, తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌బికెఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలలో పరీక్షలు జరుగుతాయన్నారు. నేటి నుండి 30 వరకు జరగనున్న జేఈఈ మెయిన్స్ పరీక్షకు అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ విడుదల చేసింది. 24వ తేదీ వరకు నిర్వహించబోవు పరీ క్షకు ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుండి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవలసిందిగా తెలిపారు. ఆ తర్వాత తేదీల పరీక్షకు తదుపరి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు.

**జేఈఈ మెయిన్స్ విద్యార్థులకు సూచనలు**

- గేట్ మూసివేసే సమయం తర్వాత, అంటే పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులెవరూ ప్రవేశించడానికి అనుమతించబడరు.
- సూచించిన 'ఎంట్రీ స్లాట్' ప్రకారం అభ్యర్థి తప్పనిసరిగా కేంద్రానికి చేరుకోవాలి.
- అడ్మిట్ కార్డ్, అండర్‌టేకింగ్, చెల్లుబాటు అయ్యే ఐడి ప్రూఫ్, సరైన పరీక్ష లేకుండా అభ్యర్థులెవరూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించడానికి అనుమతించబడరు.
- హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా ఫ్రిస్కింగ్ నిర్వహించబడుతుంది.
- అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి వ్యక్తిగత పారదర్శక నీటి సీసా, ఒక సాధారణ పారదర్శక పెన్, ఎన్‌టిఎ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేయబడిన అండర్‌టేకింగ్‌తో పాటు అడ్మిట్ కార్డ్ (ఎ4 సైజు పేపర్‌పై స్పష్టమైన ముద్రణ) తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది.
- రిజిస్ట్రేషన్ సమయంలో ఆన్‌లైన్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసినట్లు ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్, చెల్లుబాటు అయ్యే ఫోటో ఐడెంటిఫికేషన్ ప్రూఫ్
- పరీక్ష రాసే విద్యార్థులు తమ ధ్రువీకరణను తెలిపే ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులను తీసుకెళ్లడం తప్పనిసరి. పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు లేదా 12వ తరగతి అడ్మిట్‌కార్డు, అభ్యర్థి ఫొటో ఉన్న బ్యాంకు పాసుపుస్తకం. వీటిలో ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. పరీక్ష కేంద్రానికి పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకెళ్లడం మరిచిపోవద్దు.
- ఆన్‌లైన్ దరఖాస్తు చేసినప్పుడు అప్‌లోడ్ చేసిన ఫొటోను ఎగ్జామ్ సెంటర్‌కు తీసుకెళ్లాలి. ఎందుకంటే దాన్ని అటెండెన్స్ షీట్‌పై అతికించాల్సి ఉంటుంది. విద్యార్థులు ట్రాన్స్ పరెంట్‌గా ఉండే బాల్‌పాయింట్ పెన్ను తీసుకెళ్లాలి.
- దివ్యాంగులైన విద్యార్థులు ఎవరైనా ఉంటే వారు తమవెంట మెడికల్ ఆఫీసర్ ధ్రువీకరించిన సర్టిఫికెటును తీసుకెళ్లాలి.
- పరీక్ష సమయానికి రెండు గంటలు ముందుగానే చేరుకొనేలా ప్లాన్ చేసుకోండి. అడ్మిట్ కార్డులో పేర్కొన్న సమయానికి మీకు కేటాయించిన పరీక్ష కేంద్రం వద్ద రిపోర్టు చేయండి. పరీక్ష హాలు తెరవగానే మీకు కేటాయించిన సీట్లో కూర్చొని అన్నీ ఉన్నాయో, లేదో సరిచూసుకోండి.
- పరీక్ష కేంద్రంలో ఇచ్చే రఫ్ షీట్లపైనే కాలిక్యులేషన్లు /రైటింగ్ వర్కు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత రఫ్ షీట్లను కచ్చితంగా ఇన్విజిలేటర్‌కు అందజేయాలి.

# అదుపుతప్పి మోటార్ బైక్ బోల్తా.. ఒకరి మృతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గానుగపెంటపల్లి గ్రామ సమీపంలోని ఓ మలుపు వద్ద మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని సున్నంవారిచింతల గ్రామానికి చెందిన గోగుల రత్నయ్య (40) తన కుటుంబంతో కలిసి బెంగుళూరులో బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో సంక్రాంతి సెలవులు ముగియడంతో సీతారామపురం కేజీబీవీలో చదువుతున్న తన చిన్న కుమార్తెను పాఠశాలలో వదిలేందుకు బెంగుళూరు నుంచి సున్నంవారిచింతలకు మంగళవారం వచ్చాడు. అనంతరం దుత్తలూరు మండలం వెంకటంపేట ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లేందుకు తన మామ మంచాల వెంగయ్యతో కలిసి బైక్ పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో గానుగపెంటపల్లి గ్రామ వద్దనున్న మలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న రాయిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనాకి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రత్నయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. రత్నయ్య మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# తప్పిపోయిన మహారాష్ట్ర వ్యక్తి ఆచూకీలభ్యం

**తల్లిదండ్రులకి అప్పగింత**




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట దర్గా దర్శనం కోసం సోమవారం మహారాష్ట్ర నుండి ఓ కుటుంబం వచ్చింది. అ కుటుంబ సభ్యులలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి సోమవారం రాత్రి కనిపించ కుండా పోయాడు. దీంతో మంగళవారం స్థానిక పోలీసులకు మహారాష్ట్ర కుటుంబ సభ్యులు, మాలోని విశాల్ పరమేశ్వర్ జాగ్దే, కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సైదులు, కేసు నమోదు చేశారు. అనంతరం ఆ వ్యక్తి ఆచూకీ కోసం ఏఎస్ఐ భాస్కర్ రెడ్డిని కానిస్టేబుల్, షబీర్,ని గాలించమని ఆదేశించారు.చివరికి ఆత్మకూరులోని ఓ కూడలిలో మతిస్థిమితం లేని విశాల్ పరమేశ్వర్ జగ్దేనీ గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వారు తల్లిదండ్రులకు అప్పగిం చారు. ఏఎస్ఐ, భాస్కర్‌ని షబ్బీర్‌నీ ఎస్ఐ సైదులు, అభినందించారు.

# జీవో117రద్దుతో గ్రామీణ పాఠశాలలు..

# మనుగడ సాధించేనా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రప్రభుత్వం గతం ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దుచేయడంతో ఇకనైనా గ్రామీణ ప్రాంత పాఠశాలల మనుగడ సాగిస్తాయా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం పలు పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనంచేస్తూ 117 జీవో విడుదల చేసి అమలు చేయడంతో అనేక పాఠశాలలు మూతపడడం, పలు పాఠశాలలు 10లోపు విద్యార్థులతో సాగుతుండడం జరుగుతోంది. ఈప్రభుత్వం ఆ జీవోను రద్దుచేసి కొత్తగా మాడల్‌స్కూళ్ళు ఏర్పాటు, క్లస్టర్ విధానం అమలు, ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనంచేసేలా నిర్ణయించారు. గతంలో ఉన్నతపాఠశాలల్లో విలీనంచేసిన 3,4,5తరగతుల విద్యార్థులను మళ్ళీ ప్రాథమిక పాఠశాలలకే పంపేలా నిర్ణయించారు. దాంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు మనుగడ సాగిస్తాయని అందరూ భావిస్తున్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తాం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక దశలోనే పునాదులు వేస్తాం, ఆంగ్లమాధ్యమం ప్రవేశపెడుతున్నాం, చిన్నారులందరినీ సర్కారు బడులకు రప్పిస్తాం, అమ్మఒడి, మధ్యాహ్నంభోజనం, విద్యాదీవెన, విద్యాకానుక, యూనిఫారం దుస్తులు, బూట్లు, టైలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇస్తాం అంటూ ఎన్నెన్నో ప్రయోగాలను వైసిపి ప్రభుత్వం అమలుచేసినా తీరా చూస్తుంటే ఏఏటికాఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. తల్లిదండ్రులు కాన్వెంట్లపై మోజు పెంచుకుంటున్నారు. ఆత్మకూరు మండలంలో ఈ విద్యాసంవత్సరం పరిశీలిస్తే ఉన్నతపాఠశాలలు 13, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 63 ప్రభుత్వపరంగా ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం ఆరంభమై అడ్మిషన్లు పూర్తయ్యాక పరిశీలించగా ఈ76పాఠశాల్లో 1నుండి10 తరగతుల విద్యార్థుల సంఖ్య 4483గా ఉండగా 13 ఉన్నత పాఠశాలల్లో 2817మంది విద్యార్థులు కాగా మిగతా 63 ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1664మంది మండలంలో మాత్రమే ఉన్నారు. సగటున ఒక పాఠశాలకు 26.4మంది ఉన్నారు. మండలంలోని రావులకొల్లు, ఆరవేడుజంగాలపల్లి, అల్లీపురం పాఠశాలల్లో విద్యార్థులు గతంలో ఉన్నవారు వెళ్ళిపోగా ఈదపా సున్న నమోదు కావడంతో ఆపాఠశాలలు మూతపడ్డాయి. మండలంలోని 10మందికన్నా విద్యార్థులు తక్కువగా 9 పాఠశాలలు, 25మందికన్నా తక్కువగా 22పాఠశాలలున్నాయి. సాతానుపల్లి పాఠశాలలో 6మంది, చెర్లోయడవల్లి పాఠశాలలో 8మంది, మరుగుళ్ళమెయిన్ పాఠశాలలో నలుగురు, అప్పారావుపాలెం ఈస్ట్ ఎస్‌సి పాఠశాలలో 7మంది, ఆత్మకూరు ఈస్ట్ పాఠశాలలో 10మంది, ఎల్ఆర్ పల్లి ఉర్దూపాఠశాలలో ముగ్గురు, ఎల్ఆర్‌పల్లి మెయిన్ పాఠశాలలో 6మంది, వాసిలి ఎస్‌సి పాఠశాలలో 5మంది, పేరారెడ్డిపల్లి ఎస్టీ పాఠశాలలో 7 మంది, రావులకొల్లు పాఠశాలలో ముగ్గురు మాత్రమే విద్యార్థులుండడంతో ఈ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి ఉర్దూపాఠశాలలో 2021-22లో ఒక్క విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు, 2022-23లో నలుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఈదపా ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఒక స్వీపర్ కూడా పనిచేస్తుండగా ఈపాఠశాలకు రెండు పక్కా భవనాలుండగా రిపేర్లు, బాత్‌రూముల నిర్మాణాన్ని ప్రభుత్వం 12లక్షలతో చేసింది.

# ఎస్ఈఐఎల్ ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఎస్ఈఐఎల్ ప్రాజెక్ట్ పరిధిలో సీఎస్ఆర్ నిధుల నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన వస్తువులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని దీని కొరకు ప్రాజెక్టు యాజమాన్యం1.90 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నూతన ఉప ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేతోపాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత, స్థానిక మెడికల్ ఆఫీసర్ దేవికృప, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. ముత్తుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్పు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పొదలకూరులో డయాలసిస్ సేవలు ఇప్పటికే ప్రారంభం కాగా అధికారికంగా త్వరలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదగా ప్రారంభం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గర్భిణీలు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో కాన్పులు అయ్యే విధంగా శ్రద్ధ వహించాల్సిన బాధ్యత వైద్య బృందంపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేకూరే విధంగా అధికారులు చూడాలని గ్రామ సచివాలయాల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, ఏడుకొండలు, నాటారి నాగేంద్రబాబు, తిరుమల శెట్టి సతీష్ నాయుడు, షేక్ అలిముత్తు, శ్రీనివాసులు, ఏ.ఏడుకొండలు, దండు శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి చివరి నాటికి లక్ష్యాలను అధిగమించాలి : డ్వామా పీడీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను మార్చి చివరి నాటికి నూరు శాతం అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవానీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన ఉపాధి హామీ పదకం ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కా ర్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాలన్నారు. మెటీరియల్ రావాలంటే కూలీలకు పని కల్పించాల్సి ఉందన్నారు. ప్రతి బుధవారం నిర్వహించే రీవ్యూ సమావేశాల్లో లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ఆదిశగా పయనిం చాలన్నారు. లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు తప్పనిసరిగా పని కల్పిం చాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్లస్టర్ పరిధిలో కొన్ని మండలాలు లక్ష్యాల సాధనలో వెనుకంజలో ఉన్నాయని, వాటిని అధిగమిం చాలన్నారు. అనంతరం ఉదయగిరి పట్టణంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ గాయత్రీదేవి, ఏపీవోలు బీశ్రీనివాసరావు, ఎం.సుభాషిణి, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు




**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రయాణికులను ఆకర్షించడానికి ఏపీఎస్ ఆర్టీసీ, కావలి డిపో వారు ప్రారంభించిన పథకం విజయవంతంగా కొనసాగుతుందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. డాక్టర్ రామస్వామి హాస్పిటల్స్ వారి సహకారంతో ప్రారంభించిన ఈ పథకం ప్రకారం బస్సులో ఒక పెట్టెను ఏర్పాటు చేస్తారు. బస్సులో ప్రయాణించినవారు తమ టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబర్ వ్రాసి పెట్టెలో వేయాలి. నెలకు ఒకసారి లక్కీడిప్ ద్వారా రూట్ కు ఒక్కరిని ప్రయాణికులను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేస్తారు. మంగళవారం లక్కీ డిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి వారికి విలువైన చీరలు అందజేశారు. పెద్దపవని - లింగసముద్రం రూటులో కావలి పట్టణానికి చెందిన జి. శ్రీనివాసులు, కొమ్మి - కొండాపురం రూటులో ఎర్రబల్లి గ్రామానికి చెందిన యస్కె రఫీ, అల్లూరు రూటులో కావలికి చెందిన డి వీరాంజనేయులు బహుమతులు అందుకున్నారు. బహుమతులను డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్, కమర్షియల్) ఎస్కె షమీమ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ పథకాన్ని అల్లూరు, కొండాపురం, లింగసముద్రం రూట్లలోని బస్సులకు పరిమితం చేశామని అన్నారు. ఆయా రూట్ల ప్రజలు ప్రమాదభరితమైన అక్రమ వాహనాలలో కాక సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాలని, ఆకర్షణీయమైన బహుమతులు పొందాలని కోరారు. ఈ పథకానికి ఆర్ధిక సహకారం అందిస్తున్న డాక్టర్ మంచికంటి రామస్వామికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్పనా రెడ్డి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ యం రామకృష్ణ, బస్టేషన్ మేనేజర్ యం రమేష్ బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, ఏడిసి పి.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు ఉదయగిరి దంపతులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దేశ రాజధానిలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉదయగిరి పట్టణం దిలా వర్బాణవీధికి చెందిన షేక్ సందానీ, షాహీన్ దంపతులకు దక్కింది. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో 120 మంది కళాకారులు పని చేస్తున్నారు. వారిలో షేక్ సం దానీ, షాహీన్లను ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరు రావాలని ఢిల్లీ పీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దేశ రాజధానిలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు తమకు అవకాశం రావడం పై ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నర్సరీల్లో 50లక్షల మొక్కల పెంపకం

● డీఎఫ్ఓ మహబూబ్ బాషా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆటవీ, సోషల్ ఫారెస్టుల ఆధ్వర్యంలో పలు నర్సరీల్లో 59లక్షల మొక్కలు పెంచుతున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి రేంజ్ పరిధిలోని దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో నర్సరీలను, ప్లాంటేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. అటవీ శాఖ 19, సోషల్ పారెస్టు 40లక్షలు చొప్పున నర్సరీల్లో మొక్కలు పెంపకం జరుగుతుందన్నారు. జిల్లాలో వనసరంక్షణ సమితుల్లో పెంచిన జామాయిల్ కర్రను త్వరలో కటింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జేకే పేపర్ మిల్స్. రాయ్ ఘడ్ వారు టన్ను రూ.8,100లకు దక్కించుకొందన్నారు. అగ్రిమెంట్ పూర్తయిందని, సుమారు 78వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చన్నారు. వీఎస్ఎస్లకు దక్కాల్సిన 50శాతం వాటాతో వారి పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్ఎస్వ్వ శ్రీరాములు, ఎఫ్బివోలు వెంకటేశ్వర్లు, ఓంప్రకాష్, లక్ష్మీప్రసన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కావలి సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక సబ్జిడీలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి మండల లోకదాలత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి లోక్ ఆడాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ, ఆర్డీవో వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విచారణలో ఉన్న ఖైదీలను గురించి కొన్ని చట్టాలు, నూతనంగా ప్రవేశ చట్టాల గురించి వివరించారు. సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా జనజీవన స్రవంతిలో మెలగాలని తెలిపారు. అలాగే ఎవరైనా తక్కువ కులాల వారిని అవహేళన చేయడం వారిని ఇబ్బందులకు గురి చేయడం సభ్యత సంస్కారం కాదని ఖైదీలు అందరూ సమానమేనని ఈ సందర్భంగా జడ్జి శోభ తెలిపారు. అలాగే ఆర్డీవో వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అయితేనేమి, ఉపాధి పథకాలు అయితే ఉపయోగించుకొని సమాజంలో గౌరవంగా జీవించాలని నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని శనికావేశంలో తప్పులు చేసిన అవి సరిచేసుకొని మంచి ప్రవర్తన కలిగి జీవించాలని తెలిపారు. అలాగే ఖైదీలకు అందిస్తున్న ఆహార సదుపాయాలను అక్కడ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎండిహెచ్ఓ, ఆర్ అండ్ బి ఇంజనీర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టూ టౌన్ సిఐ గిరిబాబు, లీగల్ ఎయిడ్ మెంబెర్ ఈ.సాయి ప్రసాద్, మాలకొండ రెడ్డి,జైలు సూపర్నెంట్ చిన్న సుబ్బయ్య లోకల్ సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

# ఆర్థిక ప్యాకేజీతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం

- స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు 11వేల440 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు
- చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి ఫలించింది
- ఇక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ మాటే ఉండదు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : అప్పుల ఊబిలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు 11వేల 440 కోట్ల ఆర్థిక ప్యాకేజి ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీకి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియ చేశారు. విశాఖ ఉక్కుకు కేంద్రం ఆర్థిక ప్యాకేజి సాధించిన నేపథ్యంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంతో కీలకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీతో తిరిగి పుంజుకొని పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ యాజమాన్యం మరియు కార్మికుల సమిష్టి కృషితో నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టాలని ఆయన ఆకాంక్షించారు. కొన ఊపిరిలో వున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా 11వేల 440 కోట్ల రివైవల్ ప్యాకేజీ సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషిని ఎంపి వేమిరెడ్డి ప్రశంసించారు. గత ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేట్ పరం చేయాలని ప్రయత్నిస్తే విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేసిందని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

# కూటమి ప్రభుత్వం సమష్టి కృషితో విశాఖ ఉక్కుకు ఊపిరి



- విశాఖ స్టీల్‌కు 11వేల 440 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం
- విశాఖ ఉక్కు పూర్వ వైభవం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతోనే సాధ్యం
- ఆర్థిక ప్యాకేజి ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి కుమారస్వామికు ధన్యవాదాలు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను 11వేల 440 కోట్ల ఆర్థిక సహాయం సాధించి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధన్యావాదాలు తెలియజేశారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకుని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కు పునరుద్ధరణకు చంద్రబాబు చేసిన కృషిని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్థిక ప్యాకేజి ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి కుమారస్వామికు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంతో విశాఖ ఉక్కు పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని, నేడు కూటమి ప్రభుత్వం సమష్టి కృషితో విశాఖ ఉక్కు పరిరక్షణ సాధ్యమైందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పని చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కార్మికుల సమిష్టి కృషితో నష్టాల బారిన పడ్డ స్టీల్ ప్లాంటును లాభాల దిశగా నడిపించాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంట్ ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారీ ఆదుకుంది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విశాఖ స్టీల్‌కు ఈ దుర్గతి పట్టిందని ఆమె ఆవేదన. గత ఎన్నికల సందర్భంగా విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం తెస్తానని హామీ ఇచ్చిన 11వేల 440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ సాధించి మాట నిలబెట్టుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదుని ఆమె కొనియాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కానుందన్న ప్రచారాలను వమ్ము చేస్తూ భారీ ఆర్థిక ప్యాకేజి ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలియజే శారు. విశాఖ ఉక్కు పరిరక్షణకై నిరంతరం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ ఆర్థిక ప్యాకేజి సాధించడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అభినందనలు తెలిపారు.

### హెల్మెట్ ధరించడం..
## ప్రాణాలను కాపాడుకోండి : ఎస్ఐ



అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ : ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఏఎస్ పేట ఎస్ఐ ఏ.సైదులు పేర్కొన్నారు. 59వ జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలు మాసోత్సవాల సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ఏ.సైదులు ఆధ్వర్యంలో ఠాగూర్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఠాగూర్ పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ మీదుగా నగర్ ఖాన, దర్గా సెంటర్ వరకు ట్రాఫిక్ నిబంధనలను పాఠశాల విద్యార్థులతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తధానంతరం మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులకు, వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతపై సంబంధించిన పలు సూచనలు సలహాలు, చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మోటార్ సైకిల్, పై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే ప్రయాణంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహానాలు నడుపు రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్.వెంకట రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, కె.దొరస్వామిరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మహోత్సవంలో ఎస్ఐ



చేజర్ల, మేజర్‌న్యూస్ : రోడ్లపై వాహానాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చేజర్ల పోలీస్ స్టేషన్ నుంచి బస్టెండ్ సెంటర్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్లోగన్లతో రోడ్డు భద్రత నియమాలు ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం తదితర భద్రతా నియమాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ప్రతి ఒక్క వాహనదారునికి తాను, తన కుటుంబం ఎంత ముఖ్యమో మన ఎదురుగా వస్తున్న వ్యక్తులు, వాహదారులు అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

# రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు భద్రత కమిటీలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ నినాదాలతో ఏర్పాటు చేసిన మెగా ఫ్లెక్సీని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ ఆవిష్కరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డిటిసి చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను అన్ని కళాశాలలు, హైస్కూల్‌లలో చేపడుతున్నట్లు చందర్ చెప్పారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండిరగ్‌లో వున్నట్లు డిటిసి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడమే ఈ మాసోత్సవాల ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తరచూ




ప్రమాదాలు జరిగే ఎంపిక చేసిన సుమారు 50 ప్రాంతాల్లో ఎన్‌హెచ్ అధికారులు నివారణ చర్యలు చేపట్టారని చెప్పారు. హిట్ అండ్ రన్ కేసుల విషయంలో బాధితులకు ఇన్సూరెన్స్ నష్టపరిహారం అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని, ఈ విషయమై పోలీసువారు బాధితులకు అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్స్ పాయింట్లు వద్ద సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వాహనదారులు విశ్రాంతి తీసుకునేలా హైవేపై ఎంపిక చేసిన ప్రదేశాల్లో పెట్రోలు బంకు, డ్రైవర్ల విశ్రాంతి గదులు, హోటళ్లు, పార్కింగ్ (వే సైడ్ అమినిటీస్) మొదలైన సౌకర్యాలు అన్ని ఒకేచోట కల్పించేందుకు వెంటనే సుమారు 5 ఎకరాల స్థలం ఎంపిక చేయాలని సర్వేరికార్డుల విభాగం అధికారికి సూచించారు. గత సమావేశంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటుచేసి పోలీసు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ-దార్ ఆన్‌లైన్ సిస్టంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని, అన్ని హాస్పిటల్స్‌లో ఇందులో నమోదయ్యేలా చూడాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. నగర పరిధిలోని విఆర్సి, మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా ట్రాఫిక్ నివారణ చర్యలకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ జాతీయరహదారిపై వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్టు తప్పనిసరిగా ధరించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నెల్లూరు నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తికావచ్చిందని, పోలీసు కంట్రోలు రూంతో వీటిని అనుసంధానిస్తామన్నారు. కోవూరు నుంచి బుజబుజనెల్లూరు వరకు హైవే వరకు కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రముఖ కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు కూడా పూర్తి కావచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎఎస్పీ సౌజన్య, డిటిసి చందర్, ఆర్‌టివోలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, ఎన్‌హెచ్ఎ పిడి చౌదరి, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్‌వలి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ , మున్సిపల్ ఎస్‌ఈలు గంగాధర్, అశోక్‌కుమార్, రామ్మోహన్, మార్కెటింగ్‌శాఖ ఏడి అనిత, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన సీఐ

## ● కరపత్రాల ఆవిష్కరణ ● వాహనాల తనిఖీ ● ఆటోడ్రైవర్లతో ప్రత్యేక సమావేశం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ట్రాఫిక్‌పై సీఐ గంగాధర్ ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా మంగళవారం పట్టణంలో ఎస్ఐ షేక్ జిలానీ, సిబ్బందితో రోడ్డుభద్రతామా సోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటో డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వమించారు. ట్రాఫిక్‌నిబంధనలు, ప్రమాదాలు జరుగకుండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వివరించే కరపత్రాలను రూపొందించి వాటిని ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. ఆటోలను డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని, మితిమీరిన వేగం తగదని, అధికంగా ప్రయాణీకులను ఎక్కించుకోరాదని, రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ ఆటోలను నిలుపరాదని సూచించారు. ట్రాఫిక్ నియమావళి పాటించాలని, ప్రమాదాలు జరుగకుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏదేని ప్రమాదాలు జరిగినపుడు వెంటనే ఆటోల్లో డ్రైవర్లే క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించాలని, లేదా 108వాహనానికి ఫోన్‌చేయాలని కూడా గంగాధర్ సూచించారు. వాహనాలను నడిపేసమయంలో డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించాలని, ముందు వాహనాలను క్రాస్‌చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని, ఎదుటి వాహనాలను జాగ్రత్తగా తప్పించాలని ఆయన కోరారు. ఈమేరకు అందరికీ అవగాహన లక్పించేలా రూపొందించిన కరపత్రాలను ఆటోడ్రైవర్లకు, ఇతర వాహానాల డ్రైవర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ షేక్ జిలానీ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం వివాదాల పరిష్కారానికి మంచి విధానం

## - న్యాయమూర్తి గాయత్రి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మధ్యవర్తిత్వం అనేది వివాదాల పరిష్కారానికి మంచి విధానమని ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం అనే అంశంపై స్తానిక కోర్టులో మంగళవారం సెన్సిడైజేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ సదస్సుకు గాయత్రి అధ్యక్షత వహించి ప్రసంగించారు. స్తానిక బార్‌అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం గురించి అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అని, వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అని ఆమె తెలిపారు. ఈ విధానం ఖర్చును, సమయాన్ని ఆదా చేస్తుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. విభాగం 8సిపిసి, ఆర్డర్1రూల్10 ప్రత్యామ్నాయ వివాదం స్పష్టత, మరియు మధ్యవర్తిత్వ నియమాలు2017 సుప్రీమ్‌రోర్టు మధ్యవర్తిత్వం మరియు ప్రాజెక్టుకమిటీ నిబంధనలు2015, మధ్యవర్తిత్వచట్టం2023 తదితర అంశాలగురించి న్యాయమూర్తి గాయత్రి వివరించి అందరికీ అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వ విధానాన్ని అందరూ పాటించాలని కూడా ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ శిరాజుద్దీన్, మీడియేషన్ న్యాయవాది ఎల్.వి.రమణయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పశువుల పధకాలను సద్వినియోగం చేసుకోవాలి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం పశుఅభివృద్ధికి గాను రైతులకోసం అనేక పధకాలు అమలుచేస్తుందని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్తసంచాలకులు డాక్టర్ రమేష్‌నాయక్ కోరారు. మంగళవారం ప్రభుత్వ ఆదేశాలమేరకు ఆత్మకూరు మండలం నువ్వురుపాడులో స్థానిక పశుసంవర్ధకశాఖ సమాయ సంచాలకులు డాక్టర్ జయచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని రమేష్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న గోకులాలు, పశుగ్రాస ఉత్పత్తి కార్యక్రమం, పెయ్యదూడల ఉత్పత్తి కాఉర్యక్రమం, వ్యాధినిరోధక కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. ఈకార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశు అభివృద్ధికి వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈసందర్భంగా శిబిరంలో పశువైద్యాధికారులు పశువులకు వైద్యపరిక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధానాలు గురించి డాక్టర్ జయచంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిసంక్షేమసంఘం అధ్యక్షుడు, తెలుగుదేశం నాయకుడు కొండ్రెడ్డి రమణారెడ్డి, కోవూరు డిఎల్‌డిఏ ఈవో డాక్టర్ శ్రీనివాసరావు, స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఏడి డాక్టర్ జయచంద్ర, కావలి డివిజనల్ ఆఫీస్ ఏడి డాక్టర్ రసూల్, కరటంపాడు పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణయాదవ్, పశుసంవర్ధక సహాయకులు ఏ.శివ, సిబ్బంది, గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఆర్టీసీ డీఎం రేపే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు సంబంధించి డయల్‌యువర్ డీఎం కార్యక్రమం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తామని స్థానిక డిపోమేనేజర్ షేక్ కరిమున్నీసాబేగమ్ పేర్కొన్నారు. 23వతేదీ ఉదయం 11నుండి 12గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆత్మకూరు ప్రాంత ప్రయాణీకులు తమ విలువైన సూచనలు, ఏదేని సమస్యల ఫిర్యాదులు డయల్‌యువర్ డీఎం కార్యక్రమంలో 9959225645 నెంబరుకు ఫోన్‌చేయాలని కరిమున్నీసాబేగమ్ పేర్కొన్నారు.

# అనధికార లేఅవుట్లకు విద్యుత్‌శాఖ నోటీసులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనధికార లేఅవుట్లకు విద్యుత్ డీఈ ఐ.శ్రీనివాసరావు మంగళవారం నోటీసులిచ్చారు. నెల్లూరు నుడా వైస్‌చైర్మెన్ సూర్యతేజ ఆదేశాలతో ఆత్మకూరు పట్టణానికి చెందిన 10 అనధికార లేఅవుట్లకు నోటీసులిచ్చామన్నారు. ఈ లేఅవుట్లు అనధికారికంగా ఉన్నందున విద్యుత్ కనెక్షన్లు ఎందుకు తొలగించరాదంటూ ఆయన నోటీసులిచ్చారు. ఈ 10 లేఅవుట్లకు సంబంధించి అనుమతి పత్రాలుంటే తమకు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. 15రోజుల గడువులో అనుమతిపత్రాలు అందించకుంటే విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. విద్యుత్‌శాఖతోపాటు మున్సిపల్ అధికారులకు కూడా ఇదే విషయమై నుడా నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన పేర్కొన్నారు.

# ఆత్మకూరులో పెన్షనర్ల సమావేశం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని యుటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పి.శ్రీరాములు, ప్రధానకార్యదర్శి కె.సుధాకరరావుల ఆధ్వర్యంలో సమావేశం జరుగగా పెన్షనర్లకు సబంధించిన పలు సమస్యలు, లైఫ్‌సర్టిఫికేట్లు, ఇన్‌కమ్‌ట్యాక్స్ నూతన, పాత విధానాలు తదితర అంశాలగురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు రమణయ్య, నాయకులు శ్రీరామమూర్తి, మణిప్రసాద్, ఖాజామొహిద్దీన్, పలువురు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మడపల్లిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని మడపల్లి గ్రామంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూడలకు, పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు, పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించబడినది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు శ్రీకాంత్, మల్లికార్జున్, ఏహెచ్‌ఏ శ్రీహరి, గోపాలమిత్ర సునీల్, మడపల్లి గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో జరిగే ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ గురు జయంతి తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని తిక్కవరం, ఇడ్లపాడు, రామనాయుడుపల్లి పంచయితీలలో ఉచిత శిబిరాన్ని ప్రారంభించి దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలించక పశువులు రోగాల బారినపడి మృత్యువాత పడటంతో రైతు ఆర్థికంగా చితికి పోతున్నారు. రైతులకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. పశువులు దూడలు సన్న జీవాలకు నట్టల నివారణ మందులను ఉచితంగా ఇటీవల బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని, పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. గొర్రెలు మేకలకు బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. పశువులు గొర్రెలు మేకలకు సమస్య వచ్చిన మా దృష్టికి తీసుకువచ్చిన పరిష్కరిస్తామన్నారు. పశువుల యజమానులు ఈ ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారిని అండగా పవర్ యూత్ స్వచ్ఛంధ సేవ సొసైటీ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రగతి నగర్ నందు అందరూ బాగుండాలి అందులో మనము ఉండాలి అనే లక్ష్యంతో గత వారం ముందు దర్గామిట్ట ప్రగతి నగర్ వద్ద పవర్ యూత్ స్వచ్ఛంధ సేవ సొసైటీ కార్యాలయం వద్ద ఏఎస్ పేటకి చెందిన నిరుపేద కుటుంబస్తులు గత కొంత కాలంగా 2సంవత్సరాల బాబు మెదడు సమస్యతో కళ్ళు కనపడక కాళ్లు చేతులు పని చెయ్యలేక బాధపడుతున్న బాబు హాస్పిటల్ ఖర్చులకు వారి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందిచటం జరిగింది. అదేవిధంగా పవర్ యూత్ స్వచ్ఛంధ సేవ సొసైటీ సభ్యులు మనోజ్ భార్య నాగలక్ష్మి కుమారుడు మొక్షిత్ వర్మ జన్మదినం పురస్కరించుకొని ప్రతి సంవత్సరము కూడా పేదవారికి కష్టాల్లో ఉన్న వారికి సహాయపడుతుంటారు. ఈ నేపథ్యంలో తన జన్మదినం సందర్భంగా ఈ పేద అనారోగ్య బాదిత కుటుంబాస్తులకు బాబుకి బట్టలు, 5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజు, అధ్యక్షులు ముని వెంకట సూర్య, సభ్యులు ధనలక్ష్మి, సాయిరెడ్డి, హేమంత్, బాలాజీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పౌర సేవల్లో ఆదర్శం.. ప్రకృతి పరిరక్షణలో అగ్రపథం



**కావలి, మేజర్‌న్యూస్ :** ముక్కు సూటిగా వెళ్లే అధికారులుంటే మినహా రెవెన్యూ వ్యవస్థ రాజకీయ వత్తిళ్ళకు, అసాధారణ జాప్యానికి పెట్టింది పేరు. కావలి మండలమైతే రెవిన్యూ పరంగా అనేక జఠిల సమస్యల సమాహారం అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఐతే ప్రస్తుతం కావలి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రావణ్ కుమార్ ఇందుకు భిన్నం. ఏ మాత్రం పలుకుబడి లేని సమాన్యుడు సైతం స్వేచ్ఛగా వెళ్లి తమ సమస్యలు చెప్పుకుని నిర్ణీత సమయంలోగా పరిష్కారం పొందుతున్న తీరు ప్రశంసలు కురిపిస్తోంది. విద్యార్థుల సర్టిఫికెట్లు నుంచి సాధారణ కుటుంభ సంబంధిత ధ్రువ పత్రాల వరకు, ఆపై రైతువారి పాస్ బుక్కులు కూడా టైం చార్టర్ ప్రకారం అందిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కావలి పట్టణమే కాదు మండలంలో మారుమూల గ్రామాల్లో సైతం ప్రజల్లో తహసిల్దార్ పనితీరుపై సంతృప్తి కనిపిస్తోంది. కార్యాలయ ప్రాంగణం నుంచే క్రమ శిక్షణగా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే పనితీరుపై ప్రత్యేకను చాటుతూ కార్యలయ ప్రాంగణాన్ని ఓ క్రమపద్ధతిలో తీర్చిదిద్దారు. వందేళ్ల చరిత్ర గల పాడుబడ్డ భావిని తిరిగి యదాస్తితికి తీసుకొచ్చి ప్రస్తుతం తాగునీటిగా వినియోగించే స్థితికి తీసుకొచ్చారు. ఇది ఒక్కటే కాదు ప్రకృతిని, ధర్మాన్ని కాపాడితే అదే మనిషిని సమాజాన్ని అగ్రపథంలోకి తీసుకెళుతుందన్నది వారి నమ్మకం. పదకొండేళ్ల క్రితం సుదీర్ఘ కాలం కావలి ఆర్డీవోగా పనిచేసిన సుబ్రహ్మణ్యేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాల రూపు మార్చడంతోపాటు దేవాలయాలను సైతం అద్భుతంగా తీర్చిదిద్దారు. అదే తరహాలో పని చేసుకు పోతున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌పై ప్రజల్లో సంతోషం వ్యక్తమౌతోంది.

# మర్రిపాడులో పొగాకు బ్యారన్ దగ్ధం

▶ **రూ.3.50లక్షల ఆస్తి నష్టం**



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు గ్రామంలో సోమవారం రాత్రి ఓ పొగాకు బ్యారన్ దగ్ధమై ఆ రైతుకు మూడున్నర లక్ష ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. మర్రిపాడు గ్రామానికి చెందిన గంగవరపు వెంకటసుబ్బయ్య అనే రైతు పొగాకును క్యూరింగ్ చేయడానికి పొగాకు అల్లి క్యూరింగ్ కోసం ఉంచిన ఆకులు ఎక్కువ ఉష్ణోగ్రతతో ఉన్న బ్యారన్ గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో పొగాకుతో పాటు అల్లుడు కర్ర, గొట్టాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ రైతు లక్షల రూపాయలు ఆస్తి నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. ఆరుగాలం అష్ట కష్టాలు పడి పండించిన పొగాకు కళ్ళ ఎదుటే బూడిదవుతుంటే ఆ రైతు ఆవేదనకు అంతులేకుండా పోయింది.

# వేప చెట్టుకు పాలు..

● **స్థానికులు ప్రత్యేక పూజలు**



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** వేప చెట్టుకు పాలు వస్తున్న ఘటన మండలంలోని చౌకచర్ల గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. చౌక చర్ల గ్రామ శివారులో ఉన్న వేప చెట్టు నుంచి పాలు వస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, మహిళలు చెట్టు వద్దకు చేరుకొని పోలేరమ్మ ప్రతిమ కొలిచే వేప చెట్టు నుంచి పాలు రావడంతో పూజలు చేయడం ప్రారంభించారు. ఈ వేప చెట్టు నుంచి ఎక్కువగా పాలు రావడంతో దానిని తొలగించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# రోడ్డు భద్రతా నియమాలను పాటించండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు సాగించాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టులను విధిగా ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలకేశవులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గండిపాలెంగ్రామంలో పొలం పిలుస్తుంది




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గండి పాలెం, గుడి నరవ గ్రామాలలో రైతులు వేసినటువంటి మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. పొలం పిలుస్తుంది రా కార్యక్రమంలో భాగంగా సురేఖ దేవి ఏఆర్ఎస్ పొదలకూరు, లక్ష్మీ మాధవి ఏడీఏ, డీఆర్సీ నెల్లూరు పాల్గొని మొక్కజొన్నలో పాటించవలసిన పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు స్పష్టంగా తెలియజేశారు. రైతులు కత్తెర పురుగును సరైన సమయంలో అదుపులో ఉంచాలని కోరారు. లోపలి ఆకులు పూర్తిగా తడిచే టట్లు పిచికారి చేయాలని సూచించారు. అవసరాన్ని బట్టి రెండు మూడు సార్లు మందును పిచికారి చేయాలని కోరారు. పంట చుట్టూ నాలుగు వరుసల నేపియర్ గడ్డిని ఎర్ర పంటగాను, ఎకరానికి ఐదు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. అనంతరం వరి పొలాలను సందర్శించి ఎరువుల యాజమాన్యాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్, రైతులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

**- నాడు నష్టాల్లో ఉన్నా, నేడు తీవ్ర సంక్షోభంలో ఉన్నా కాపాడింది టీడీడీ ప్రభుత్వం మాత్రమే : కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి**



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి వలన ఆర్థిక సంక్షోభంలో పూడుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోదముద్ర వేయడం జరిగిందని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకే గాక యావత్ ఆంధ్రరాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారమని, వేలాదిమంది తెలుగోళ్ళు కలిసి వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. నాపై ఉన్న కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండి, కావాలంటే మా రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని సీఎంగా జగన్‌రెడ్డి ఢిల్లీ వెళ్ళేవాడని, నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్ళి వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్ళి వచ్చిన ప్రతీసారి ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం గుడ్ న్యూస్ చెప్తునే ఉందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలి, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ రెడ్డి ప్రయత్నిస్తే విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని చంద్రబాబు ఆహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తికి సామర్థ్యమున్న విశాఖ స్టీల్ ప్లాంట్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18వేల కోట్లైన అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, ఎంపీ భరత్ తదితరులు విన్నవించిన కొద్ది రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్లు చొప్పున మొత్తం రూ.1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. స్టీల్ ప్లాంటు సంక్షోభం నుంచి బయట పడేందుకు నేడు చంద్రబాబు చేసిన కృషికి ఫలితంగా రూ.11,440 కోట్లు సాయాన్ని కేంద్ర ప్రకటించడం అభినందనీయమన్నారు. 1994లో నష్టాల పేరుతో బీఐఎస్ఆర్ ప్రమాదం ఏర్పడితే, దాన్ని అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి పునర్వ్యవస్థీకరణ జరపకుండా, ప్లాంట్లను అమ్మడానికి ప్రయత్నించిందన్నారు. అందుకు ఎర్రన్నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు చేసిన పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. 1998లో నాటి ప్రధాని వాజీపేయ్‌తో మాట్లాడి రూ.1,650 కోట్లు తీసుకువచ్చి విశాఖ ఉక్కును పరిరక్షించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వమిచ్చిన రుణాన్ని ఈక్విటీగా మార్చాలని, రుణంపై వడ్డీని మాఫీ చేసి బీఐఎస్ఆర్ కు వెళ్ళకుండా తప్పించాలని టీడీపీ ఎంపీలు కోరడంతో నాటి ఉక్కు శాఖ మంత్రి నవీన్ పట్నాయక్ రూ.1,333 కోట్ల రుణాన్ని ఈక్విటీగా మార్చడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ సమగ్రాభివృద్ధి కోసం కన్సల్టెంట్ ను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఉక్కు కర్మాగారానికి రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేయడం జరిగిందని 2002లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. అప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించింది చంద్రబాబు అని, తప్పుడు కూతలతో వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఆయన తెలిపారు.

# ఆస్తి పన్నుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి




**కమిషనర్ సూర్యతేజ**

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, కమర్షియల్ భవనాల పన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, డ్రైనేజీ పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100శాతం లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్యతేజ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, సచివాలయ అడ్మిన్, అమెనిటీ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. 25 వేల రూపాయలకు మించి బకాయిలు ఉన్న వారిని గుర్తించి వారికి సంబంధించిన ఆస్తి సీజ్ చేయాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరికలు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోని కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పరిపాలనా, అమెనిటీస్ కార్యదర్శులు మంచినీటి పన్నులను వసూళ్ల లక్ష్యాలను అందుకోవాలని, అపార్టుమెంట్లు, సినిమా హాళ్లు తదితర వాణిజ్య భవనాలకు సంభందించిన పన్నుల వసూళ్ళ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పన్ను వసూళ్ల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వసూళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసియున్నామని కమిషనర్ తెలిపారు. నగర వ్యాప్తంగా ప్రతీ భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి, డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పన్ను వసూళ్ళలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించి కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు అధికారు లంతా కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ చెన్నుడు, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, రెవిన్యూ ఇన్స్పెక్టర్లులు, పరిపాలనా కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.3.88 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా రూ.3.88 కోట్లతో 43 సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని సీతారామపురం రూ.32లక్షలు, ఉదయగిరి రూ.29లక్షలు, దుత్తలూరు రూ.37లక్షలు, వరికుంటపాడు రూ.37లక్షలు, వింజమూరు రూ.38లక్షలు, కొండాపురం రూ.45లక్షలు, కలిగిరి రూ.కోటి, జలదంకి రూ.70లక్షల చొప్పున నిధులు మం జూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

# మంచు దుప్పటి..



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం తీవ్ర స్థాయిలో మంచు కురిసింది. దీని ప్రభావంతో ఉదయం 9:30 నిమిషాల వరకు సూర్యుడు సరిగా కనిపించలేదు. తీవ్ర మంచు కారణంగా విపరీతమైన చలి ఉండటంతో మండల ప్రజలు అవస్థలు పడ్డారు. పొలాలపై మంచు దుప్పటిగా పరుచుకోవడంతో కలుపు తీసేందుకు వెళ్లిన వ్యవసాయ కూలీలు అవస్థలు పడ్డారు. ఈ సంవత్సరంలో మంగళవారమే తీవ్రస్థాయిలో మంచు ప్రభావం చూపడంతో వరి పైరుకు తెగులుసోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రామిక నగర్ నుంచి టీడీపీలోకి నూతన చేరికలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30 డివిజన్ శ్రామిక నగర్‌కు చెందిన మైనార్టీ నేత ఖాసిం ఆధ్వర్యంలో 50 మంది రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీలో తగు గౌరవం ప్రాధాన్యత ఇస్తామని గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఖాసిం, మైనార్టీలు అబ్దుల్, రెహమాన్, రషీద్, రజాక్, మసూద్, ఖాదర్, రఫీ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, స్థానిక ఇన్చార్జి ఆషిక్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూకటి హరిబాబు, యానాదయ్య, అంబాపురం నీటి సంఘం అధ్యక్షుడు పల్నాటి మస్తాన్ నాయుడు, మస్తాన్, కాజా, విగ్నేశ్వర రావు, జమీర్, ఆనందరావు, ఓబుల్‌రాజు, సురేష్, అజయ్, నాగేశ్వరరావు, రాజేష్, వెంకటలక్ష్మి, ఆరిఫాలు పాల్గొన్నారు.

